www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 25 | మార్చి | 2026 పేజీలు : 8

## వైరా ఎంవిఐ అరెస్ట్



ప్రజాపక్షం/వైరా: అవినీతి నిరోధక శాఖ అధికారులకు వైరా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ చిక్కాడు, పెనుబల్లికి చెందిన ఇటుకల వ్యాపారి వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఏసిబి అధికారులను బాధితులు కలిసి సమాచారం అందించారని ఏసిబి డిఎస్పీ వై.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వైరా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నందు డిఎస్పీ వై.రమేష్ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుమ ఏరకు వైరా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్‌ను ట్రాప్ చేసి పట్టుకోవడం జరిగిందని, రూ.24వేల నగదును తీసుకొని వరప్రసాద్ అసిస్టెంట్ పరారయ్యాడు. అనంతరం మోటార్ వెహికిల్ కార్యాలయంలో విచారణ జరపగా ఎలాంటి సంబంధం లేకుండా రూ.52800లు నగదు దొరికిందని, ఈ నగదు ఏజెంట్లు వద్ద నుంచి లైసెన్స్‌కి ఇంత అని తీసుకున్న డిమాండ్ వేసిన పేపర్ ఆధారాలు దొరికాయని ఆయన అన్నారు. ప్రజలు అవినీతి అధికారులు సమాచారాన్ని మాకు అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. అదేవిధంగా అరెస్ట్ చేయబడిన మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు.

## సత్తుపల్లి హాస్టల్‌లో హాజరు మాయాజాలం..!

-ఉండేది ఎంత మంది..
హాజరు ఎంత మందికి...
-పట్టింపులేని సంక్షేమ అధికారులు
-వార్డెన్‌పై ఆరోపణలు






ప్రజాపక్షం/ ఖమ్మం : ఎద్దు ఈనిందంటే గాటికి కట్టెయ్యనట్లు ఉంది సంక్షేమ అధికారుల తీరు. నిరంతర పర్యవేక్షణ కొరవడడంతో కొందరు వార్డెన్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్థంగా మారడమే గాక పర్యవేక్షణ లోపం కారణంగా వార్డెన్ల నైతిక ప్రవర్తన కూడా విమర్శలకు తావిస్తుంది. సత్తుపల్లిలోని ఎస్సి బాలుర కళాశాల వసతి గృహంలో మెనూ అమలు జరగడం లేదన్న ఆరోపణలు

మిగతా 2లో..

## చిగురిస్తున్న ఆశలు

-జిల్లాలో పెరగనున్న శాసనసభ స్థానాలు
-కొత్తగూడెం లేదా భద్రాద్రి కేంద్రంగా పార్లమెంట్ స్థానం



ప్రజాపక్షం/ ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చట్ట సభలకు వెళ్లాలనుకున్న రాజకీయ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లా మొత్తం 10 శాసనసభ స్థానాలు ఉండగా ఇందులో ఏడు స్థానాలు రిజర్వు కేటగిరిలోనే ఉన్నాయి. ఐదు స్థానాలు ఎస్టిలకు రిజర్వు కాగా మరో రెండు స్థానాలు ఎస్సిలకు రిజర్వు అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 50 శాతం పార్లమెంట్, శాసనసభ స్థానాలను పెంచాలని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ఆమోదించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఖమ్మంజిల్లాలో మొత్తం శాసనసభ స్థానాల సంఖ్య ఐదుకు చేరుకునే అవకాశం ఉంది. శాసనసభ స్థానాలు పెరగడంతో పాటు మహిళా రిజర్వేషన్ కూడా అమలైతే మూడు నుంచి నాలుగు స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యే అవకాశం ఉంది. ఇందులో ఒక ఖమ్మం జిల్లాలోనే మూడు స్థానాలు ఏర్పాడనుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు స్థానాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని కామేపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు నియోజక వర్గంలో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు మండలం వైరా నియోజక వర్గంలో ఉంది. ప్రస్తుత పాలేరు నియోజక వర్గంలోని కొంత ప్రాంతంతో కలిపి ఖమ్మం నియోజక వర్గం రెండు, మూడు నియోజక వర్గాలుగా ఏర్పాటయ్యే అవకాశం

మిగతా 2లో..

## చింతకానిలో నయా ఎక్సైజ్ దందా..!

మామూళ్ల మత్తులో ఎక్సైజ్.. దాడుల్లో ప్రైవేట్ సైన్యం



ప్రజాపక్షం/చింతకాని : సాధారణంగా గ్రామాల్లో అక్రమ మద్యం.. బెల్టు దుకాణాలను అరికట్టడం ఎక్సైజ్ అధికారుల డ్యూటీ.. కానీ చింతకాని మండలంలో ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జూగుతుంటే ప్రైవేట్ సైన్యంతో నయా ఎక్సైజ్ పాలసీని మద్యం దుకాణ సిండికేట్ నడుపుతుంది. చింతకాని మండలంలో ప్రభుత్వం 3 మద్యం దుకాణాలను మంజూరి చేసింది. ఈ మూడు దుకాణదారులు సిండికేట్ గా ఏర్పడి మండలంలో వ్యాపారం చేస్తున్నారు. ప్రతి దుకాణం వద్ద హోల్‌సేల్ , రిటైల్ కౌంటర్‌లు ఏర్పాటు చేసి బెల్టు దుకాణాలకు హోల్ సేల్ కౌంటర్‌లో ఒక్కో క్వార్టర్‌కు రూ. 20లకు కావాల్సిన బ్రాండ్‌లను వారు అడిగనంత సరఫరా చేస్తున్నారు. రిటైల్ కౌంటర్‌లో మందుబాబులకు ఎంఆర్‌పి ధరకు కేవలం కొన్ని బ్రాండ్‌లను మాత్రమే రేషన్ పద్ధతిలో ఒకటి, రెండు క్వార్టర్‌లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే స్టాక్‌లేదని, కావాలంటే బెల్ట్ షాపులో కొనుక్కోమని ఉచిత సలహాలు ఇవ్వడం

మిగతా 2లో..

## శ్రీరామ నవమికి భద్రాద్రి ముస్తాబు






- కళ్యాణ మండపానికి తుది మెరుగులు
- సిఎం, గవర్నర్ రానుండటంతో గట్టి బందోబస్తు
- 3 లక్షల లడ్డూల తయారీ
- పనులు పరిశీలించిన ఇఓ

ప్రజాపక్షం/భద్రాచలం : లోక కళ్యానార్థం భద్రాచలం రామాలయం ఆధ్వర్యంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణానికి భద్రగిరి ముస్తాబవుతోంది. ఇప్పటికే దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. మిథిలా స్టేడియంలోని కళ్యాణ మండపానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. రామాలదాసు కాలం నుండి రాముల వారి కళ్యాణం ఆరుబయట నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండటంతో మిథిలా స్టేడియం ప్రాంగణంలో పనులు చకచకా జరగుతున్నాయి. ఛాందినీ విస్తాలతో పందిళ్లు ఏర్పాటు చేశారు. సెక్టార్లను సిద్ధం చేస్తున్నారు. వివిఐపి, విఐపిల రాక అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపధ్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగానే భక్తులు భద్రాద్రి చేరుకునే అవకాశం ఉండటంతో గోదావరి తీరంలో వారు సేదతీరేందుకు పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం

మిగతా 2లో..

# సత్తుపల్లి హాస్టల్‌లో హాజరు మాయాజాలం..!




**(మొదటిపేజీ తరువాయి)**
వస్తున్నాయి. ఇది హాస్టల్స్‌లో జరిగేదే. అయినా ఇక్కడ మరో ప్రత్యేకత ఉంది. ఇక్కడి వార్డెన్ ఉదయం ఒకసారి, వీలు కుదిరితే సాయంత్రం ఒకసారి హాస్టల్‌కు వచ్చిపోతుంటాడు. సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఒక్కసారి ఈ హాస్టల్‌ను పరిశీలిస్తే హాస్టల్ నిర్వహణ, వార్డెన్ తీరు అవగతమవుతుంది. రిజిస్టర్‌లో నమోదు చేయబడిన లెక్కల ప్రకారం 125 మంది విద్యార్థులు ఉండగా అతి కొద్ది రోజులు మినహాయిస్తే మిగిలిన అన్ని రోజులు పూర్తి హాజరు నమోదవుతున్నట్లు హాజరు పట్టికలో నమోదైంది. ఈ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీతో పాటు బిటెక్ చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. కానీ ఏ రోజున 60 నుంచి 70 మంది విద్యార్థులకు మించి హాస్టల్‌లో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో హాజరు వేసి పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సత్తుపల్లి ఎస్సి బాలుర వసతి గృహం వార్డెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు దాదాపు కోటి రూపాయల నిధులు దుర్వినియోగం కాగా అప్పటి సర్పంచ్, కార్యదర్శి మధ్య పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటు చేసుకున్నాయి. చివరకు అధికారులు రూ. 30 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం. సోమవారం 11 గంటల సమయంలో హాస్టల్‌లో ముగ్గురు విద్యార్థులు ఉండగా మరో ఆరుగురు కళాలకు వెళ్లినట్లు వంట మనిషి తెలిపింది. జిల్లా ఉన్నతాధికారులు తగు విచారణ జరిపితే ఈ హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల హాజరు, వార్డెన్ తీరుకు సంబంధించి అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ఎవరికి అందాల్సినవి వారికి అందుతున్న సమయంలో ఉన్నతాధికారులు ఇటువంటి అవినీతి చర్యలను అరికట్టి తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

**ముచ్చర్లలోనూ అదే పరిస్థితి :**
కామేపల్లి మండలం ముచ్చర్లలో గల బాలుర హాస్టల్ పరిస్థితి అస్తవ్యస్థంగా ఉంది. ఇక్కడ సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గేటు విరిగిపోయింది. హాస్టల్ గోడ కూలిపోయింది. హాస్టల్ నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ వేణును వివరణ కోరగా హాస్టల్ నిర్వహణలో లోపం లేదని వసతుల కల్పనకు సంబంధించి నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాలేదన్నారు.

# శ్రీరామ నవమికి భద్రాద్రి ముస్తాబు

**(మొదటిపేజీ తరువాయి)** మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను సిద్ధం చేస్తున్నారు. గోదావరిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గజీతగాళ్లను, పడవలను సిద్ధం చేశారు. ఇప్పటికే గాలి గోపురంతో పాటు చుట్టు ప్రాకారాలకు విద్యుత్ దీపాల అలకరణ పూర్తవడతంర రాత్రివేళల్లో ఆలయ పరిసరాలు పండుగ శోభతో ఉట్టిపడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన సెంటర్లలోని దుకాణాలకు కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకునేందుకు యజమానులు మక్కువ చూపుతున్నారు. భక్తులు స్వామివారి కళ్యాణాన్ని కనులారా వీక్షించేందుకు మండపంలో పెద్దపెద్ద ఎల్ఇడిలు సిద్ధం చేస్తున్నారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మంచినీటితోపాటు మజ్జిక సరఫరా చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి. పట్టణంలోని ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పార్కింగ్ ప్రదేశాలను ఇప్పటికే గుర్తించి సిద్ధం చేశారు. స్వామివారి కళ్యాణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా తగిన ఏర్పాట్లతో పాటు గట్టిబందోబస్తు నిర్వహిస్తున్నారు.

**సిఎం,గవర్నర్ రానుండటంతో :** స్వామివారి కళ్యాణానికి సాంప్రదాయ బద్ధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ మరుసటి రోజు జరిగే పట్టాభిషేకానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల రానుండటంతో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్ అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఎస్‌పి పట్టణంలో మోటార్ సైకిల్‌పై తిరుగుతూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని వ్యాపారులకు సూచిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్య వీడాలని ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ ఉద్యోగులకు సూచించారు. ప్రతిష్టాత్మకంగా జరిగే వేడుకలో లోటుపాట్లుకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాముల వారి కళ్యాణంలో ముఖ్యమంత్రి దంపతులు ముత్యాల తలంబ్రాలతో పాటు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. పట్టాభిషేకం గవర్నర్ దంపతులు పాల్గొని స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉత్సవాన్ని పురస్కరుంచుని భక్తులు గోటితో వలిచిన కోటి తలంబ్రాలను, శ్రీరామ



అని రాసిన తలంబ్రాలను ఆలయంలో అందజేశారు.

**3 లక్షల లడ్డూలు :** సీతారాముల కళ్యాణమహోత్సవం సందర్భంగా భక్తుల కోసం మూడు లక్షల లడ్డూల తయారీ సాగుతోంది. అదే విధంగా పులిహోరా, చెక్కర పొంగలి కూడా ఎప్పటికప్పుడు సిద్ధం చేసి భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందించేందుకు ఆలయాధికారులు సిద్ధంగా ఉన్నారు.

**పనులు పరిశీలించిన ఇఓ :** మిథిలా స్టేడియంలో సాగుతున్న పనులను ఆలయ కార్యనిర్వాహణాధికారి దామోదర్ రావు మంగళవారం పరిశీలించారు. పనులు చేస్తున్న సిబ్బందితో మాట్లాడి లోటుపాట్లు లేకుండా పనులు సాగాలని సూచించారు. సెక్టార్ల ఏర్పాటు పకడ్బందీగా ఉండాలని, పెద్దలు విచ్చేస్తున్నందున ఎలాంటి మాటరావద్దని సూచించారు. కళ్యాణానికి దేశ నలు మూలల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారని, సాధారాణ భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బంది రావద్దని సూచించారు.

**విద్యుత్ కాంతులతో :** తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామాలయం విద్యుత్ దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగుతోంది. గాలిగోపురంతో పాటు చుట్టు ప్రకారాలకు రంగురంగుల విద్యుత్ దీపాలు అలంకరించారు. గోదావరి ఆవతలి ఒడ్డు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం నుండి రామాలయాన్ని చూస్తుంటే భక్తి భావం ఉట్టిపడుతున్నట్లు భక్తులు చెప్పుకుంటున్నారు. ఇక రామాలయం పరిసరాలు సందడితో నిండుకున్నాయి. గోదావరి అలల తీరంలో ఆలయ విద్యుత్ కాంతులు పండుగ శోభను పంచుతున్నాయి.

# పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సులు





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్ధాలను కూకటి వేళ్లతో పెగిలించే బాధ్యత యువతదేనని పోలీసులు అన్నారు. వైరా మండలంలో తాటిపూడి రెబ్బవరం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బ్రాహ్మణపల్లిలో కెజి సిరిపురం గ్రామంలో మత్తు పదార్ధాలపై యువతకు ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో సిరిపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెబ్బవరం గ్రామ సర్పంచ్ వేల్పుల జ్యోతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ దేశంలో అనేక రకాలుగా డ్రగ్స్ యువత వినియోగిస్తున్నారని వాటిని వినియోగించడం వలన యువత నిర్వీర్యం అవుతుందని, తక్షనమే యువత మత్తు పదార్ధాలను విడనాడాలని లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్‌లు శెట్టిపల్లి శ్రీనివాసరావు, జవ్వాజి అశ్విని, వేల్పుల జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో మత్తు పదార్ధాలకు బానిసలుగా మారుతున్న యువత సమాచారాన్ని పోలీసులకు చెరవేస్తే రూ.2వేలు నగదు పురస్కారం అందజేస్తానని తెలిపారు. అనంతరం ఈగల్ టీం సిఐ బివి.ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని అవగాహన కల్పించాలని కోరారు. ఈగల్ ఫోర్ సిబ్బంది అనిల్‌కుమార్ విజయ్, ఎక్సైజ్‌శాఖ ఎస్సై సాయికుమార్, డిపార్ట్‌మెంట్ డిఆర్‌వో బి.శ్రీను, వైరా ఎస్సై పుష్పాల రామారావు, ట్రైన్ ఎస్సై పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి శేషిరెడ్డి, సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

# చిగురిస్తున్న ఆశలు

**(మొదటిపేజీ తరువాయి)**
ఉండగా తల్లాడ, కొణిజర్ల కేంద్రంగా మరో నియోజక వర్గం రూపుదిద్దుకునే అవకాశం ఉంది. దాదాపు ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోనూ మార్పులు చేర్పులు తథ్యం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాల్వంచ కేంద్రంగా ఒక నియోజక వర్గం ఏర్పాటుకు అవకాశం ఉందని భావిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లందు నియోజక వర్గంలోని గార్ల, బయ్యారం, మహబూబాబాద్ జిల్లాలు ఉండగా భద్రాచలం నియోజక వర్గంలోని వాజేడు, వెంకటాపురం, ములుగు జిల్లాలో ఉన్నాయి. ఏ జిల్లాకు ఆ జిల్లాను విడగొట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తంగా రెండు నియోజక వర్గాలు ఏర్పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా 2009కు ముందు నియోజక వర్గాల పునర్‌విభజన జరిగినప్పుడు కూడా రాష్ట్రం, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇప్పుడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. గతంలో జరిగిన నియోజక వర్గాల పునర్ విభజన కొంత మంది రాజకీయ నాయకులకు స్థానం కల్పించకూడదన్న లక్ష్యంతో జరిగిందన్న ఆరోపణలు వినవచ్చాయి. అందుకే అస్తవ్యస్థంగా పునర్ విభజన జరిగింది. ఉదాహరణకు మధిర నియోజక వర్గంలోని చివరి గ్రామం నుంచి మరో చివరి గ్రామం వరకు 100 కిలో మీటర్లు పైబడి ఉంది. అలాగే మండలాల కూర్పు కూడా సరిగ్గా లేదన్న ఆరోపణలు వచ్చాయి. ఈ దఫా నియోజక వర్గాల ఏర్పాటు ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలన్న డిమాండ్ వినవస్తుంది. పార్లమెంటు స్థానాలు కూడా పెరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం లేదా భద్రాచలం కేంద్రంగా పార్లమెంట్ నియోజక వర్గం ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా చాలా కాలంగా చట్ట సభలకు పోటీ చేసే అవకాశం కోసం ఎదురు చూసి రిజర్వేషన్ల కారణంగా పోటీ చేయలేకపోవడం శాసన సభ స్థానాల సంఖ్య కూడా తక్కువగా ఉండడంతో చాలా మంది దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉన్న అవకాశం చిక్కలేదు. ఖమ్మం జిల్లాలో శాసనసభకు మహిళలు ప్రాతినిధ్యం వహించింది కూడా చాలా తక్కువే. ప్రస్తుత 10 మంది శాసనసభ్యుల్లో ఒక్కరే మహిళ ఉన్నారు. గతంలో ఇల్లందు, వైరా, మధిర, భద్రాచలం నియోజక వర్గాల నుంచి శాసన సభకు మహిళలు ప్రాతినిధ్యం వహించగా ప్రస్తుతం సత్తుపల్లి నుంచి మట్టా రాగమయి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తంగా రానున్న శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కొంత మంది ఆశావాహుల ఆశలు నెరవేరడంతో పాటు మహిళలకు కూడా తగు రీతిలో ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది.

# చింతకానిలో నయా ఎక్సైజ్ దందా..!

**(మొదటిపేజీ తరువాయి)** కొసమెరుపు

### కనిపించని తనిఖీలు...

బెల్టు దుకాణాలు ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమేనని అందరికీ తెలిసిన విషయమే. కానీ టార్గెట్ ప్రకారం మద్యం అమ్మకాలు జరిపించాల్సిన భాధ్యత ఎక్సైజ్ అధికారులది. ఎన్ని బెల్టు షాపులు పెరిగితే అంత వ్యాపారం పెరుగుతుందనే విధానంతో దుకానాలకు అనుమతులిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే కళ్ళెదుటే దుకాణాలు కనిపిస్తున్నా అటువైపు దృష్టిసారించట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్ని గ్రామలకైనా పంపండి మేము ఇచ్చిన టార్గెట్‌ను మాత్రం అధిగమించాలి అని వ్యాపారులకు హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం.

### పోలీసులది అదే తీరు...

ఎక్సైజ్ అధికారుల తీరు ఇలా ఉంటే స్థానిక పోలీసుల తీరూ అంతే ఉంది. వారే పట్టించుకోకపోతే మాకెందుకని పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇద్దరూ సమన్వయంతో ముందుకెళ్తేనే గుడుంబా తరహాలోనే బెల్టు షాపులను పూర్తి స్థాయిలో నివారించవచ్చు.

### ప్రైవేట్ సైన్యం అక్రమ తనిఖీలు..

రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ఓ వ్యక్తిని, వాహనాన్ని తనిఖీ చేసే అధికారం పోలీసులకి, ఎక్సైజ్ వారికి , ఆర్టీఏ సిబ్బందికి అధికారం ఉంటుంది. కానీ చింతకాని మండలంలోని వైన్ షాపు సిండికేట్ ఓ పదిమంది ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి అక్రమ తనిఖీలకు తెరలేపారు. వీరంతా ఖమ్మం నగరానికి చుట్టపక్కన చింతకాని మండల పరిధిలోని అల్లీపురం క్రాస్ రోడ్డు, వెంకటాయపాలెం రోడ్డు, రామకృష్ణాపురం క్రాస్ రోడ్డు, మత్కేపల్లి క్రాస్ రోడ్డు, కొణిజర్ల క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్ల ప్రక్కన ఉంటూ వచ్చిపోయే వాహన దారులను ఆపుతూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మద్యం ఏమైనా సరఫరా చేస్తున్నారేమేనని చెప్పడం విడ్డూరం.

### పాకిస్తాన్ బోర్డర్ దాటినట్లే..

ఇంట్లో శుభకార్యాలకి దావత్ చేయడం తెలంగాణ లో పరిపాటి. ఇంట్లో ఏదైనా శుభకార్యం ఉండి ఖమ్మంలో మద్యం కొనుగోలు చేసి చింతకాని మండలంలో ప్రవేశించాలంటే పాకిస్థాన్ బోర్డర్ దాటినట్లే నని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బోనకల్ మండల వాసులు , ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల వాసులు నిత్యం ఖమ్మం నగరానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వీరు ఖమ్మంలోని లిక్కర్ మార్ట్, వైన్ షాపుల్లో మద్యం కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. ఖమ్మం బోనకల్ మార్గంలో ఇటీవల మద్యం సిండికేట్ ప్రైవేట్ సైన్యం ఆగడాలు ఎక్కువయ్యాయి. ఇటీవల బోనకల్‌కు చెందిన ఓ వ్యక్తి శుభార్యానికి ఫుల్ బాటిల్స్ తీసుకెళ్తుంటే ఆపి బండి తాళం తీసుకొని మద్యం బాటిల్స్‌ని స్వాధీనం చేసుకుని స్థానిక వైన్ షాపుకు తరలించారు. ఓ రాజకీయ నాయకుని జోక్యంతో వివాదం సర్దుమణిగింది. ఈ ప్రైవేట్ సైన్యం ఆగడాలు ఇంతటితో ఆగకుండా గ్రామాల్లో బెల్టు దుకాణాల తనిఖీల పేరుతో ఇండ్లలోకి సైతం ప్రవేవించి ఇబ్బంది పెడుతున్నారని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు మత్తు వీడి అక్రమ తనిఖీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలోని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలను ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రపంచ ప్రఖ్యాత కవు విలియం షేక్స్‌ఫియర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంధర్భంగా పలువురు విద్యార్థులు డ్రామా, డిబేట్, ఎస్ఏ రైటింగ్, వంటి పలు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లాంగ్వేజ్ డిపార్ట్‌మెంట్ హెడ్ టి. అరుణ కుమారి, విజయ ప్రసాద్, శెట్టి స్వరూపరాణి, రమేష్, పొట్లపువ్వు శ్రీనివాసరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, ఫర్వీన్, బాబ్జి, ఎన్. శ్రీదేవి, శ్రీను, కరీమా, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ అభివృద్ధి నిధులు పూర్తిస్థాయిలో వినియోగించాలి



**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రణాళిక ప్రకారం ఎస్సీ అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివిధ శాఖలతో ఎస్సీ అభివృద్ధి నిధులపై అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, మహిళా శిశు సంక్షేమ శాఖ, రోడ్లు, భవనాల శాఖ, ప్లానింగ్, మిషన్ భగీరథ, ఎన్‌పిడిసిఎల్, ఎస్సీ అభివృద్ధి శాఖల పరిధిలో ఎస్సీ అభివృద్ధి నిధుల వినియోగంపై చర్చించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించి ప్రతి శాఖ పరిధిలో షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు ప్రాధాన్యతనివ్వడం కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో సాగు ఆధునీకరణ, ఇతర అభివృద్ధి పథకాలు ఎస్సీ రైతులకు అమలు చేయడంలో కొంత వెనకబడి ఉన్నామని రాబోయే సంవత్సరంలో వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. హార్టికల్చర్ విభాగంలో ఆయిల్ పామ్ మైక్రో ఇరిగేషన్ పథకాలలో ఎస్సీలకు కేటాయించిన లబ్ధిదారులు 20 శాతం కూడా చేరకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఆరోగ్యలక్ష్మి స్కీమును మరింత మెరుగ్గా అమలు చేసి పూర్తి స్థాయిలో నిధులు వినియోగించాలన్నారు. ప్రతి శాఖకు విడుదల చేసే నిధులలో ఎస్సీలు, ఎస్టీలకు తప్పని సరిగా ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, ఈడి ఎస్సీ కార్పోరేషన్ నవీన్‌బాబు, సిపిఓ శ్రీనివాస్, డిడబ్ల్యూఓ వేల్పుల విజేత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, డిఆర్‌డిఓ కె. శ్రీరామ్, పిడి హౌజింగ్ బి. శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, పోలీస్, విద్యుత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**-ఈగల్ ఫోర్స్ డిఎస్‌పి మధుమోహన్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డ్రగ్స్, చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఈగల్ ఫోర్స్ డిఎస్‌పి మధుమోహన్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రఘునాథపాలెం, వి. వెంకటాయపాలెం, చింతగుర్తి, మల్లెపల్లి గ్రామాల్లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వి. వెంకటాయపాలెంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, ఈగల్ ఫోర్స్ డిఎస్‌పి మధుమోహన్‌రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ డిఎస్‌పి మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులు, ప్రజలు, యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులను, యువతను చైతన్యపరుస్తామన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల విద్యార్థి భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని, ఆరోగ్య సమస్యలతో పాటు చదువులో వెనకబాటు వంటివి కనిపిస్తాయని తెలిపారు తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించి జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ వినియోగంపై దృష్టి సారించాలని ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే 1908కు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వి. అశోక్‌కుమార్, సిఐ ఉస్మాన్ షరీఫ్, తహసీల్దార్ శ్వేత, ఎక్సైజ్ సిఐ కృష్ణ, డిఆర్‌వో సాల్మాన్‌రాజ్, ఎంఈఓ రాములు, సిడిపిఓ వీరభద్రమ్మ, ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచులు గాజుల కృష్ణారావు, కాపా ఆదినారాయణ, తమ్మిని ప్రియాంక, తేజావత్ బద్రి, ఉప సర్పంచ్‌లు ప్రవీణ్, బండి వెంకన్న, ఎస్‌ఐలు జి. నరేష్, ఎం. తేజేశ్వర్ రెడ్డి, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎ. తులసిరామ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అనురాధ, కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలను అరికట్టాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఏ వెంకన్న, జిల్లా నాయకులు గంట శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటి రాజులు. మంగళవారం పట్టణంలోని గుడిపాడులో గల పోడు భూములకు ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్ తీస్తుండగా పోడు సాగు చేస్తున్న గిరిజన మహిళలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు,గిరిజనులకు మధ్య వాగ్వివాదం జరిగింది. కాకరపల్లి బిట్ లోని సుమారు 85 ఎకరాలను దాదాపుగా 20 సంవత్సరాల నుంచి పేద గిరిజనులు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని సర్వే నిర్వహించి గుడిపాడు గిరిజనులు సాగు చేసుకుంటున్న 85 ఎకరాలలో 60 ఎకరాలకు పట్టాలి ఇచ్చి, మిగిలిన 25 ఎకరాలకు పట్టాలివ్వకుండా వాళ్లపై అక్రమంగా కేసులు పెట్టి నిరంతరం కోర్టు చుట్టూ తిప్పుతున్నారని సిపిఐ మాస్ లైన్ నాయకులు తెలిపారు. గత వారం రోజుల నుంచి గుడిపాడు పోడు భూముల్లో ఫారెస్ట్ వాళ్ళకి గిరిజనులకి నిరంతరం ఘర్షణ జరుగుతూనే ఉన్నాయని ట్రెంచ్ తీయటానికి వచ్చిన జెసిబి ని అడ్డుకున్న గిరిజనులపై ఫారెస్ట్ వాళ్లు అక్రమంగా దౌర్జన్యంగా దాడులు జరిపి గిరిజన మహిళ మట్ట రంగమ్మ ను గాయపరచడం జరిగిందన్నారు. గిరిజన మహిళలపై జరిగిన ఫారెస్ట్ అక్రమ దాడులను ప్రజలు ప్రజాస్వామికవాదులు ఖండించాలని వారు కోరారు.

# కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టియుసి ధ్యేయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఐఎన్టీయూసీ పని చేస్తోందని యూనియన్ నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఐఎన్టీయూసీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ భూపాలపల్లిలో జరిగిన సమావేశంలో సింగరేణి కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించినప్పటికీ, మెడికల్ బోర్డు పునరుద్ధరణలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఏఐటీయూసీ పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం విషయంలో ఐఎన్టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆదాయపన్ను మాఫీ, సొంతింటి పథకం, మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. డాక్టర్ సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్, జే.వి.ఆర్ ఓసి ఫిట్ సెక్రటరీ సీతారామరాజు , కిష్టారం ఓసి ఫిట్ సెక్రటరీ బాలాజీ , నాయకులు సురేష్ , శ్రీధర్ , పొట్టి కిరణ్ , ఐ.వి.రెడ్డి , మురళీకృష్ణ , శ్రీనివాస్ రాము , తిరుమల రావు , రామచందర్ , రమేష్ , ఇక్బాల్ , సుదర్శన్ , రామారావు ,శ్రీనివాస చారి , శ్రీనివాసరావు , అశోక్ , సదానందం , సుదర్శన్ , గణేష్ , వెంకటేశ్వర్లు, షాట్రాక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కంటే ప్రమాదకారి డ్రగ్స్ : ఎస్ఐ



**ప్రజాపక్షం/ తల్లాడ :** సమాజాన్ని అతలాకుతలం చేసిన కరోనా కంటే అత్యంత ప్రమాదకారి డ్రగ్స్ అని, దీన్ని శాశ్వతంగా తుదిముట్టించేందుకు ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం 99రోజుల ప్రజాపాలన కార్యక్రమాల్లో భాగంగా డ్రగ్స్ రహిత సమాజం డ్రగ్స్ అరికట్టడంపై అవగాహన సదస్సు తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లోని హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ గతంలో విదేశాల్లో, ఇతర రాష్ట్రాలో ఉండేవని ప్రస్తుతం పట్టణం ప్రాంతాల్లో కూడా వ్యాప్తి చెందాయని, దీని పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటికి బానిసైతే జీవితం అధకారం అవుతుందన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ ఉన్నట్లు తెలిస్తే 1908కు సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, ఎంపిఓ ఏనుగు సురేష్‌బాబు, ఈగల్ ఎస్సై రమేష్, అబ్కారీ ఎస్సై రతన్‌రెడ్డి, అటవీశాఖ రేంజర్ ఉమా, అన్నారుగూడెం వైద్యులు గోపి, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, మల్లారం సర్పంచ్ కిరణ్ తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు డ్రగ్స్ మాఫియా వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని క్షుణ్ణంగా వివరించారు. అనంతరం అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



**ప్రజాపక్షం/ తల్లాడ :** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 23ఏళ్ల వయస్సులోనే తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవుల స్ఫూర్తితో పోరాడు తామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా తల్లాడ మండల కేంద్రంలో టియుసిఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం పరాయి దేశాల మీద ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న అమెరికా దురాక్రమణాలకి యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదమని అన్నారు. కామ్రేడ్ భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌లకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు సిహెచ్ నరేష్, రామారావు, గాంధీ, చందు, నాగులు కృష్ణ, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బీఆర్ఎస్ పార్టీ (బీఆర్ఎస్) పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరిన సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులను సత్తుపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కౌన్సిలర్ మిర్జా భాషా, మాజీ కౌన్సిలర్లు చాంద్ పాషా, అద్దంకి అనిల్, పర్వతనేని వేణు, జొన్నలగడ్డ కృష్ణ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. వడ్డెర సంఘం నాయకులు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన వడ్డెర సంఘం సత్తుపల్లి మండల అధ్యక్షులు ఉప్పు హనుమంతరావు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి గుంజి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి కమిటీ సభ్యుడు చల్ల వెంకటేశ్వరావు తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కి తరలించారు.

# రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మంగళవారం 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబుతో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సిసి రోడ్డు నిర్మాణానికి రూ.12లక్షలు కేటాయించిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డికి డాక్టర్ కాపా చంద్రకళ, కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. రూ.12లక్షల నిధులు మంజూరు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణకు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ ఇంది రమ్మ పాలనలో అభివృద్ధి ధ్యేయంగా పాలన కొనసాగుతుందని సిసి రోడ్ల నిర్మాణం నాణ్యతతో ఉండాలని నాణ్యత లోపంతోనిర్మాణాలు చేపడితే సహించేది లేదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, నవీన్, షఫి, ఖాజా, పృథ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

# జమలాపురంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో రూ.5లక్షలు ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన సిసి రోడ్డుకు మంగళవారం గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సహకారంతో జమలాపురం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చట్టు పార్వతీ, మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, బాబురావు, రాజీవ్‌గాంధీ, మాజీ జెడ్పిటిసి అంకశాల శ్రీనివాసరావు, వేమిరెడ్డి అంకిరెడ్డి, షేక్.జానిబాషా, నన్నపనేని రామారావు, వెంకట్రామిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసగిస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** తెలంగాణలో నిరుద్యోగుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేస్తోందని మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు గద్దల రామకృష్ణ విమర్శించారు. మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీ నోటిఫికేషన్ తరువాత జాబ్ క్యాలెండర్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, పక్క రాష్ట్రాలు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుంటే తెలంగాణలో మాత్రం నిరుద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక అనేక మంది వయోపరిమితి దాటిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## గిరిజన పాఠశాలకు అభివృద్ధి వసతులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** హైదరాబాద్‌కు చెందిన వెరిస్క్ అనలిటిక్స్ కంపెనీ ఆర్థిక సహకారంతో సమరిటన్స్ ఫర్ ద నేషన్ సంస్థ ఆధ్వర్యంలో బూర్గంపాడు గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ 3.50లక్షల వ్యయంతో ఒక అదనపు తరగతి గది మరియు ఒక వాష్ రూమ్ నిర్మించి విద్యార్థుల వినియోగానికి అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ ఫౌండర్ రామ్ కుమార్ హాజరై మాట్లాడుతూ గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన కల్పించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు, సోంపల్లి మధ్య ఉన్న కిన్నెరసాని ఇసుక ర్యాంప్ నుంచి నడుస్తున్న టీఎస్ఎండీసీ ఆన్‌లైన్ ఇసుక లారీలు మండల కేంద్రం రోడ్డు మీదుగా వెళ్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింటోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులు, బ్యాంక్, పోస్టాఫీసుకు వచ్చే వృద్ధులకు ప్రమాదం ఏర్పడే అవకాశముందని పేర్కొంటూ లారీలను అడ్డుకున్నారు. లారీలు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్ది చెప్పి లారీలను అక్కడ నుండి పంపించారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనం డ్రగ్స్ అని, వాటికి దూరంగా ఉండాలని ఈగల్ ఫోర్స్ డీఎస్పీ కే నర్సింగరావు పిలుపునిచ్చారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలు, నగరాలకు వెళ్లే యువత స్నేహితుల ఒత్తిడితో డ్రగ్స్‌కు అలవాటు పడే ప్రమాదం ఉందన్నారు. ఒక్కసారి ప్రయత్నించడం కూడా జీవితాన్ని నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహా సమాజం మొత్తం కలిసి "సే నో టు డ్రగ్స్" అనే సందేహాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీఐ సాగర్, ఎస్ఐ గోపి, ఎంఈఓ జయరాజ్, సర్పంచ్ వీర ప్రతాప్(టోనీ), ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు పంచాయతీపరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని పదమూడు అనాధ వృద్ధ ఆశ్రమాలను సందర్శించి, నిత్యవసర సరుకులను మంగళవారం అందజేశారు. వీటిని ఈనెల 25,26న జరిగే జాతీయ స్థాయి టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ శ్రీ చైతన్యోత్సవ్26లో భాగంగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక, అకాడమిక్ డైరెక్టర్ డీన్ డాక్టర్ సుదర్శన్, ఏఓ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, శ్రీకుమార్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు

**-పౌర హక్కులపై అవగాహన**
**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ (పిఓఏ), పౌర హక్కుల పరిరక్షణ (ప్రొటక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అందించిన వివరాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ సేవా ఫౌండేషన్ వారు అందిస్తున్న సేవల దృష్ట్యా అందులో ఉన్న నిరాశ్రయులకు, అనాథలకు గుర్తింపు పత్రాలు, ఆధార్ ఇతరత్రా లభించేలా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పింఛన్లు జారీ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మం నగరం 60వ డివిజన్‌లో ఉన్న ఎస్సీ స్మశానవాటికకు కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం అందించిన విధి విధానాల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు ప్రాధాన్యతలభించేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, ఈడి ఎస్సీ కార్పోరేషన్ నవీన్‌బాబు, సిపివో శ్రీనివాస్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, సభ్యులు దాస్‌మహరాజ్, అన్నం శ్రీనివాసరావు, ఎం. అంజయ్య, జివి భద్రయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**- ఈగల్ టీం ఏసీపీ శివం నాయుడు**





**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కూసుమంచి గ్రామ పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈగల్ టీం ఏసీపీ శివం నాయుడు హాజరైనారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్ అనే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, ఒక సారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే బయటపడటం చాలా కష్టమని హెచ్చరించారు. చదువుకునే వయస్సులో యువత చెడు అలవాట్లకు బానిసలవకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమాజంలో డ్రగస్ నిర్మూలన కోసం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం సర్పంచ్ కొండా క్రిష్ణవేణి మాట్లాడుతూ గ్రామాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు లోనవ్వకుండా చదువు మరియు క్రీడల వైపు మరలాలని సూచించడం జరిగింది. అనంతరం మండల విద్యాశాఖ అధికారి రాయల వీరస్వామి మాట్లాడుతూ డ్రగ్స్ అనే సామాజిక ముప్పు నుండి యువత దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తు కోసం చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమాని పోలీస్ శాఖ, గ్రామ పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు లోనవకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిపి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్ఐ నాగ రాజు మాట్లాడుతూ కొంత మంది యువకులు చెడు స్నేహాల కారణంగా మత్తు పదార్థాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు అన్నీ నాశనం అవుతాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల గ్రామ సర్పంచులు గుర్వాయిగూడెం సర్పంచ్ బిక్షం నాయక్, లోక్యతండా సర్పంచ్ వెంకటేష్ నాయక్, కూసుమంచి గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయితీ కార్యదర్శి నీరజ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, యువత, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో నిర్వాహకులు ముఖ్య అతిథికి కృతజ్ఞతలు తెలిపారు.

# అశ్వాపురం సంత వేలం రూ. 6.60లక్షలు

**-సంత వేలం పాటను దక్కించుకున్న తేజావత్ వీరన్న**
**-రహదారిపై సంతతో ప్రజలకు కష్టాలు**





**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించే వారాంతపు సంత వేలం మంగళవారం అశ్వాపురం గ్రామ పంచాయితీ ఆవరణంలో ఎంపీడీవో ముత్యాలరావు అధ్యక్షతన గ్రామ పంచాయితీ సర్పంచ్ బానోత్ సదర్‌లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మొదటగా పంచాయితీ కార్యదర్శి కందిమల్ల శ్రీకాంత్ పాటను ప్రారంభించారు. గిరిజన ప్రాంతం కావడంతో వేలంపాటలో గిరిజనులు మాత్రమే పాల్గొనాలని నిబంధన ఉండటంతో మండలంలోని అధిక శాతం గిరిజనులు పాల్గొన్నారు. వేలంపాటను తేజావత్ వీరన్న అనే వ్యక్తి రూ 6లక్షల60వేల రూపాయలకు దక్కించుకున్నారు.

**సంత నిర్వహణపై తీవ్ర విమర్శలు...**

గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ సంతకు మంచి ఆదరణ ఉండటంతో వేలం ధర కూడా గణనీయంగా పెరిగింది. అయితే సంత నిర్వహణపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సంతను గ్రామ ప్రధాన రహదారిపైనే నిర్వహించడం వల్ల వాహనదారులు, ఉద్యోగులు, బాట సారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారి పూర్తిగా రద్దీగా మారి, ప్రయాణం కష్టసాధ్యంగా మారుతోంది. సోమవారం రోజున సంత ప్రారంభమైతే రహదారి మొత్తం వ్యాపారలతో నిండిపోవడంతో అత్యవసర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ, కొంత మంది మార్గమధ్యంలోనే వెనుదిరగాల్సి వస్తోంది. సంత వేలం నిర్వహించడం మాత్రమే కాకుండా, గ్రామ పంచాయితీ అధికారులు సంతను రహదారిపై కాకుండా ప్రత్యేకంగా ఒక మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇలా చేస్తే రహదారి రాకపోకలు సాఫీగా సాగడంతో పాటు, వ్యాపారులకు కూడా సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అన్నపురెడ్డిపల్లి మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా మండలంలోని పలు ముఖ్య ప్రభుత్వ సంస్థలను ఆయన సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ముఖ్యంగా ఎర్రగుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడి వైద్య సేవల అమలు తీరు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం మండల ప్రధాన కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాలను సందర్శించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి చదువు పరిస్థితులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యత వంటి అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో బోధన ప్రమాణాలను మెరుగుపర్చాలని, విద్యార్థినుల భద్రత మరియు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాలలో వండిన వంటలను రుచి చూశారు. వేసవికాలంలో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు పాఠశాల, కిచెన్ పరిసర ప్రాంతాలను ఆవరణమును పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ పర్యటనల సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కట్టుబడి పని చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య మరియు ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ పర్యటనతో స్థానిక అధికారుల్లో చురుకుదనం పెరిగింది. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటన మండలంలో ప్రభుత్వ సేవల అమలు మెరుగుపడేందుకు దోహదపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, వైద్యాధికారిని ప్రియాంక, కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శారద, పంచాయితీ రాజ్ ఏఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రూ 2.90 కోట్లకు పండితాపురం పశువుల సంత వేలం

**-ధర రాకపోవడంతో కలెక్టర్‌కు నివేదిక పంపనున్న అధికారులు**



**ప్రజాపక్షం/కామేపల్లి:** రాష్ట్రంలో ప్రముఖ పశువుల సంతగా పేరొందిన కామేపల్లి మండలం పండితాపురం శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత ఈ సారి రూ 2కోట్లు 9లక్షలకు వేలం దక్కింది. మంగళవారం సంత భవనంలో నిర్వహించిన బహిరంగ వేలంపాటలో గిరిజన యువకులు భూక్య వీరన్న, బోడా శ్రీను, ధరావత్ వినోద్ కుమార్, ధరావత్ విన్నిబాబు మధ్య పోటాపోటీగా వేలం సాగగా చివరకు భూక్య వీరన్న రూ 2.09కోట్లకు సంతను దక్కించుకున్నారు. అయితే గత ఏడాది సంతకు కనీస మద్దతు ధర రాలేదని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంతకు గతంలా పెద్ద ఎత్తున పశువులు రాకపోవడంతో నష్టాలు వచ్చే అవకాశముందని వేలంలో పాల్గొన్న యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంత వేలం ద్వారా సుమారు 39 మంది యువకులకు ఉపాధి లభిస్తుందని కాంట్రాక్టర్ వీరన్న తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, డీఎల్పీవో విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, ఎంపీఓలు వివీఎస్ శాస్త్రి, రవీంద్ర ప్రసాద్, జీఎస్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు నెహ్రూ, శంకర్, విజయ్ కుమార్, నాగేంద్రబాబు, ప్రవీణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీకాంత్ నేతృత్వంలో ఏఎస్ఐ వెంకటరత్నం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# పిండిప్రోలు వారపు సంత వేలం రూ.29.60 లక్షలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని పిండిప్రోలు వారపు సంత 29 లక్షల 60 వేల రూపాయలకు వేలం పలికింది పిండిప్రోలు గ్రామపంచాయతీలో ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనే నిర్వాహకులు 50 వేల రూపాయలు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకుని వేలంలో మొత్తం 45 మంది పాల్గొన్నారు. బహిరంగ వేలానికి జిల్లా పంచాయతీ రాజ్ అధికారి రాంబాబు పాల్గొని ప్రభుత్వం నిర్ణయించిన సంత మద్దతు ధర 24 లక్షల రూపాయలు ఉండగా అంతకన్నా ఎక్కువ వేలంలో పాడిన వారికి 2026 27 సంవత్సరానికి సంత క్రయవిక్రయాల్లో గ్రామపంచాయతీ నిర్ణయించిన రేట్లపై సంవత్సరం పాటు జీవాల రహదారి కూరగాయల దుకాణాలపై పూర్తి బాధ్యత వేలం అతనికి ఉంటుందని ఆయన తెలిపారు. పోటాపోటీగా వేలంలో పాల్గొన్న సభ్యులు 29 లక్షల 60 వేల రూపాయలకు కంచర్ల వెంకన్న నర్సంపేట మహబూబాద్ జిల్లాకు చెందిన సంత వేలం కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం 30 లక్షల 30 వేల రూపాయలు వేలం పలికిన సంత ఈ సంవత్సరం 70 వేల రూపాయలు తగ్గింది పిండిప్రోలు వారపు సంతలో ఇప్పటికే తాగునీరు మూత్రశాలలు, షెడ్లు నిర్మించామని రానున్న రోజుల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశామని సర్పంచ్ కామాల సువార్త, ఉప సర్పంచ్ చామకూరి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ కే సిలార్ సహెబ్, ఎంపీఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, కోటేశ్వరరావు, వార్డు సభ్యులు స్థానిక గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



**ప్రజాపక్షం/ మధిర:** డ్రగ్స్ రహిత సమాజం ప్రతిఒక్కరి బాధ్యత అని, డ్రగ్స్ మహమ్మారి తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వైరా ఎసిపి సారంగపాణి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మధిర, మండలంలోని హైస్కూల్స్‌ల్లో డ్రగ్స్ నివారణ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని, ప్రజలందరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు అలవాటు కాకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. యువత భవిష్యత్ దృష్ట్యా డ్రగ్స్ రహిత సమాజం కోసం తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మధిర టౌన్, రూరల్ సిఐలు డి.రమేష్, మధు, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్బుగూడెం ఉప సర్పంచ్ అక్రమాలపై విచారణ జరపాలి

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం గ్రామ ఉప సర్పంచ్‌పై వస్తున్న అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మొగిలి రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి పట్టాదార్ పాస్ బుక్స్ పొందినట్లు వస్తున్న ఆరోపణలను అధికారులు సీరియస్‌గా తీసుకుని నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ భూములపై అక్రమాలు జరిగి ఉంటే వాటిని వెంటనే రద్దు చేసి భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అన్నారు. అలాగే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిందిపోయి ఇటువంటి ఆరోపణలు రావడం దురదృష్టకరమని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపిడిఓ



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపిడిఓ బొగ్గా నారాయణ అన్నారు. మండల పరిధి ఉల్వనూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, నర్సరీలను మంగళవారం తనఖీ చేశారు.ఈ సంధర్భంగా ఆశ్రమ పాఠశాలలో బియ్యం, పప్పులు, కూరగాయలను పరిశీలించారు.విద్యార్థుల గదుల్లో పూర్తి స్థాయిలో ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌లో సమస్యలపై విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు అందించే మెనూ వివరాలతో కూడిన చాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కల పెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, వార్డెన్ వీరన్న, ఏపిఓ పోరండ్ల రంగా, కార్యదర్శి పరశురాం, క్షేత్ర సహాయకులు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా ఎల్లమ్మ తల్లి కళ్యాణం



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండలంలోని కరకగూడెం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మూడు రోజుల నుంచి ఎల్లమ్మ పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తిప్పని క్రిష్ణారావు లలిత, తిప్పని శ్రీనివాసరావు శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం మైలలు తీయగా సోమవారం పుట్ట బంగారం ఆలయం వద్దకు భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చారు. మంగళవారం ఎల్లమ్మ తల్లి జమదగ్ని కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కల్యాణ మహోత్సవం జనగం జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమాదురు గ్రామానికి చెందిన ఉగ్గు పూజారులు జిట్టె వీరస్వామి, తుప్పతి యాదయ్య, గుమళ్ళ అశోక్, ఆసర్ల ప్రశాంత్, కర్రె నందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్లమ్మ జమదగ్నిలను భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## మద్యం దందాపై దాడులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ దాడులు కొనసాగుతున్నాయి. భాగ్యనగర్ తండా పరిధిలోని లావుడియా తండాలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో బెల్ట్ షాపులో నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సమాచారం ప్రకారం సుమారు రూ 20వేల విలువైన మద్యం పట్టుబడినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ ప్రశాంతి స్పందిస్తూ రెండు మద్యం సీసాలను మాత్రమే స్వాధీనం చేసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇదే బెల్ట్ షాపుపై గతంలో రెండు కేసులు నమోదై తహసీల్దార్ ఎదుట లక్ష రూపాయల బైండ్‌ఓవర్ కూడా చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం విక్రయాలపై ఎలాంటి సహనం ఉండదని, రాజకీయ ఒత్తిడులు వచ్చినా దర్యాప్తు ఆగదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రగ్స్ రహిత సమాజంకై కృషి చేద్దాం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సమాజంలో రోజురోజుకీ మాదకద్రవ్యాల బారిన యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని ఈగల్ ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు, సుబ్లేడు, బీరోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లోని హైస్కూల్లో తిరుమలాయపాలెం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ ప్రత్యేక డ్రగ్స్ నిర్మూలన సంస్థను ఏర్పాటు చేసి యువత మాదకద్రవ్యాల నిర్మూలన పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటం వలన కలిగే నష్టాలను వివరించారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ రహిత సమాజం కోసం తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కష్టపడి చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సమాజానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామల్ల సువార్త, ఉప సర్పంచ్ చామకూరి రాజు, డిపిఓ రాంబాబు ఎంపీడీవో ఎస్‌కే సిలార్ సహెబ్, స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్, ఎక్సైజ్ ఎస్ఐ సాయి బాబా, ఫారెస్ట్ ఆఫీసర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీల పనితీరుపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి కేవలం 36 శాతం మంది పిల్లలు మాత్రమే వస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, మంచి ప్రాథమిక విద్యను అందిస్తున్నప్పటికీ పిల్లలు రాకపోవడానికి గల కారణాలను గమనించాలన్నారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ లోపం ఉంటే వెంటనే అవసరమైన పోషకాలు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ అంశాన్ని తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సిడిపివోలు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తూ ప్రజలలో విశ్వాసం కల్పించి అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు రెగ్యులర్‌గా వచ్చేలా కృషి చేయాలన్నారు. 85 శాతం కంటే ఎక్కువగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు, పిల్లలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే హాజరు శాతం ఖమ్మం అర్బన్, మధిర మండలాల్లో చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఇంప్రూవ్ కాకపోతే చర్యలు ఉంటాయన్నారు. ఆర్‌బిఎస్‌కె వైద్య బృందాలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసే ముందు సమాచారం అందిస్తే సామ్, మ్యామ్ పిల్లలను వైద్య పరీక్షలకు అందుబాటులో పెడతారన్నారు. జిల్లాలో పిల్లలందరికీ అభా, ఆధార్, అపార్ కార్డు వంద శాతం జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ తప్పకుండా పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మేర టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా వంటి పనులు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రదీప్‌బాబు, సిడిపివోలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్నుల భారం తగ్గించాలి

**-కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో ప్రజలపై మోపుతున్న ఇంటి పన్నుల భారాన్ని వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అనంత్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఆస్తి పన్నులు వేసే అధికారాన్ని కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు ఏమిటో ప్రజలకు కమిషనర్, మేయర్ లు చెప్పాలన్నారు. అనంత్ సంస్థ వేస్తున్న ఆస్తి పన్నులపై అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉందని వెంటనే గత పాలసీనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి పన్నులపై పాత జీవో ఉత్తర్వులను పక్కనపెట్టి క్రమబద్దీకరణ పేరుతో నగర ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆయన ఆరోపించారు. పన్నులపై వడ్డీ పేరుతో అపరాధ రుసుములు వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇంటి పన్నుల భారం




తగ్గించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రం, విష్ణు, ఎంఎ జబ్బార్, భూక్యా శ్రీనివాసరావు, మీరాసాహెబ్, నవీన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఈగల్ టీం అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలు భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్ట అనే నినాదంతో పోలీసు శాఖ, ఈగల్ టీం అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు సప్తపది ఫంక్షన్ హాల్, మోడల్ స్కూల్ హైస్కూల్ లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, హాజరై డ్రగ్స్ వినియోగం పట్ల అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, ఏసిపి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం ప్రస్తుత సమాజానికి ప్రమాదకరంగా మారి ప్రధాన సమస్యగా తయారైందని అన్నారు. చెడు స్నేహాలతో మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలై ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని పాడు చేసుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ కు అడ్డుకట్ట వేసే తెలంగాణ ప్రభుత్వం చేసే ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగాన్ని అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈగల్ టీం ఫోర్స్ ని 1908 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిందని తెలిపారు. డ్రగ్స్ వాడకాన్ని అడ్డుకట్ట వేయడానికి ఈగల్ టీం కి, పోలీస్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి వివం బంజర రింగ్ సెంటర్లో మానవహారం గా ఏర్పడి మత్తు పదార్థాలను నిర్మూలిద్దామని నినాదాలతో అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రిని ఈగల్ టీం పోలీసు శాఖ పంపిణీ చేశారు.

# మాదక ద్రవ్యాల వినియోగం చట్ట విరుద్ధం

**ఈగల్ ఫోర్స్ తెలంగాణ అధికారి జీవన్ రెడ్డి**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మాదకద్రవ్యాలు వినియోగం చట్ట విరుద్ధమని, వాటిని వాడిన వాడమని మరొకరిని ప్రోత్సహించిన కఠిన శిక్షలు తప్పవన్నారు ఈగల్ ఫోర్స్ తెలంగాణ అధికారి జీవన్ రెడ్డి. మండల పరిధిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. పోలీస్ శాఖ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యాజమాన్యం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈగల్ ఫోర్స్ తెలంగాణ అధికారి జీవన్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, అబ్కారీ ఎస్ఐ, ఎంపీడీఓ, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ అన్వేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం చట్టవిరుద్ధమని, వాడిన లేదా ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు అవగాహన లోపం, స్నేహితుల ప్రభావం వల్ల మాదకద్రవ్యాలకు ఆకర్షితులవుతున్నారని, ఇది వారి భవిష్యత్తుతో పాటు కుటుంబాలను కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. చిన్ననేరాలైనా ఎఫ్ఐఆర్‌లో నమోదు అయితే ఉద్యోగ అవకాశాలపై ప్రభావం ఉంటుందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. శేషారత్నకుమారి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, సాంకేతికతను మంచి పనులకు వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి , కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి (ఎస్ అండ్ హెచ్) డా. షేక్.మీరాసాహెబ్, అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, ఫ్యాకల్టీ మెంబర్స్, కళాశాల నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా 99రోజుల ప్రణాళిక



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలోని 29వ వార్డులో 99రోజుల ప్రణాళిక కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా అక్కడి రహదారులకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగింపు చేశారు. అలాగే నీరు నిల్వ ఉన్న చోట నుంచి కాలువల్లోకి వెళ్లే విధంగా గుంతలు తీపించడంతో పాటు ఖాళీ స్థలాలను జేసీబీ ద్వారా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు వెంపట రవి, వెంపటి వెంకన్న, సురేష్‌రెడ్డి, కొక్కు రాజు, ఆవుల మురళి, అవిరినేని నాగేశ్వరరావు, వెంకన్న, కాలనీలవాసులు పాల్గొన్నారు.

# లెక్చరర్‌కు దేహశుద్ధి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజ్ లెక్చరర్‌కు విద్యార్థిని కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విద్యార్థిని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో సివిక్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న ఓ ప్రబుద్ధుడు గత రెండు సంవత్సరాలుగా విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో భరించలేని విద్యార్థిని విషయాన్ని కుటుంబ సభ్యులకు మంగళవారం తెలిపింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అగ్గిమీద గుగ్గిలమై కళాశాలకు చేరుకుని సదరు లెక్చరర్ కు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి విషమించకుండా సదరు లెక్చరర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లెక్చరర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మధిర రామాలయం చైర్మన్‌గా వంగవీటి



**ప్రజాపక్షం/మధిర :** మధిర రామాలయం చైర్మన్‌గా వంగవీటి రాజశేఖర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వంగవీటి రాజశేఖర్ మాట్లాడుతూ తన్నపై ఉన్న నమ్మకంతో రామాలయం చైర్మన్‌గా నియమించినందుకు డిప్యూటీసిఎం మల్లు భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామాలయ అభివృద్ధికి చైర్మన్‌గా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** అదనపు కలెక్టర్ శ్రీజ పెనుబల్లి మండలంలో మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆమె పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల భవన మరమ్మత్తుల పనులను ఆమె పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ప్రసూతి విభాగాలను పరిశీలించి హాస్పిటల్లోని ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ల వివరాలను, అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని మౌలిక వసతులను పరిశీలించి ప్రధాన వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# స్ట్రక్చర్ కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జీఎం కార్యాలయంలో స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు ఏరియా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. సత్తుపల్లి డిస్పెన్సరీని అన్ని సౌకర్యాలతో కూడిన ఏరియా హాస్పిటల్‌గా అభివృద్ధి చేసి గైనకాలజిస్ట్‌ను నియమించాలని, జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్‌మెంట్ సహా అవసరమైన మ్యాన్‌పవర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అధిక బొగ్గు ఉత్పత్తి నేపథ్యంలో ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు, 75 శాతం ప్లేడేలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జీఎం ఆదేశించారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

# ఘనంగా ఎదుర్కోళ్ల ఉత్సవం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారి ఎదుర్కోళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు శేష వాహనంపై గిరి ప్రదక్షిణ చేయించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి స్నాతకం క్రతువు కార్యక్రమం ముగిసింది. అనంతరం ఎదుర్కోళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. స్వామి వార్ల గోత్ర ప్రవరలు, గుణగణములు లీలా వైభవములను వర్ణిస్తూ కొందరు అర్చకులు, వేదపండితులు వ్యవహరించినారు. స్వామి వార్ల తరుపున పెండ్లి పెద్దలుగా ధర్మకర్త ఉప్పల విజయదేవశర్మ, ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు మురళీమోహన్ శర్మ, వేదపండితులు వ్యవహరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయదేవశర్మ,ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వికెసిఎం ఓసిలో యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి చేయాలి

- కార్మిక హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు నిర్మిద్దాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** వికెసిఎం ఓపెన్ క్యాస్ట్‌లో సింగరేణిసంస్థ యంత్రాలతో, సింగరేణి కార్మికులతో బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలని, ప్రైవేటీ కరణవైపు యాజమాన్యం మొగ్గు చూపితే ప్రతిఘటిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షను సాబీర్ పాషా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికెసిహెచ్‌పి క్రషర్ల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించే కుట్రలు చేస్తున్నారని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం పివికె5 ఇంక్లైన్ నుండి సత్తుపల్లిలో సుదీర్ఘ కాలంగా డెప్యుటేషన్‌పై వెళ్లిన జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా మార్పుచేసి వారికి తిరిగి కొత్తగూడెం ఏరియాలో పోస్టుగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో జికే ఓపెన్ క్యాస్ట నుండి సత్తుపల్లికి వెళ్లిన సింగరేణి ఉద్యోగులందరినీ తక్షణమే వికెసిఎం ఓసికి వెనక్కు తీసుకురావాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. సంస్థ లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించడంలో .యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం తగదని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని పాషా హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్రనాయకులు వంగ వెంకట్, జి వీరస్వామి, వి మల్లిఖార్జున రావు, ఎస్‌వి రమణమూర్తి, ఎస్ నాగేశ్వరరావు, చందర్ రావు, రాములు, బండారు మల్లయ్య, కార్పొరేటర్ మునిగడప పద్మ, మూనిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను నివారించడమే యువత లక్ష్యం కావాలి

-డీఎస్పీ పుష్పన్ కుమార్






**ప్రజాపక్షం/కామేపల్లి:** మాదక ద్రవ్యాలను నివారించడమే యువత లక్ష్యం కావాలని, డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు యువత పాటు పాడాలని డిఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. మంగళవారం 99 రోజుల్లో భాగంగా మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవ సందర్భంగా కామేపల్లిలో ఎస్ఐ పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలతో కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను కోల్పోతున్నారని, తల్లిదండ్రులు యువతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చూడాలని, పిల్లల భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలని, వారి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాల్లో కూడా డ్రగ్స్ వేగంగా వ్యాపిస్తుందని యువత దక్షకు అలవాటు పడి జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ అమ్మిన డ్రగ్స్ వినియోగించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎక్సైజ్ ఎస్ఐ వసంతలక్ష్మి , వైద్యాధికారి నెల్లూరి చందన, ఎంఈఓ వెంకట్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు అజ్మీర హరి, రాందాస్, గ్రామస్తులు అంతోటి అచ్చయ్య, రంగయ్య, పోలీస్ సిబ్బంది, ఆదినారాయణ, హరి, అంజయ్య, రమేష్, ప్రదీప్, భరత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం పోరాటం

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. 13వ వేతన ఒప్పందంలో ఉన్న పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని, అలాగే 14వ వేతన ఒప్పందాన్ని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతోనే చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్ష కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం జరిగిన రిలే నిరాహార దీక్షలో కాటం శ్రీనివాసరెడ్డి, తాటిపూడి ఆనంద్, ఆకిని సర్వేశ్వరరావు, పగడాల మల్లేష్ రెడ్డి, ఈతకోటి జాన్సన్, బత్తుల గోపాలరావు తదితరులు పాల్గొని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి మద్దతుగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, ఐటీసీ బీఆర్‌టీయూ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, ఐటీసీ బీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీ షేక్ అజీమ్, బీఆర్‌టీయూ నాయకులు గోపాల్, సాయిబాబు, ఐటీసీ బీఎంఎస్ అధ్యక్షులు బిజ్జం అశోక్‌రెడ్డి, బీజేపీ నాయకులు చుక్కపల్లి బాలాజీ సంఘీభావం తెలిపారు. అలాగే కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్ సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఇంట్యాక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు వీరన్న, కాంట్రాక్ట్ కార్మికులు కుమార్ తదితరులు పాల్గొని కార్మికుల నిరసనలకు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం మరియు యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ద్విచక్రవాహనాన్ని లారి ఢీకొని ఓ పత్రికలో ఎడిషన్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం వైపునుంచి వైరా వైపు వెళుతున్న లారి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఓ తెలుగు దినపత్రికలో జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జ్‌కి తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

# గురవయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** చిన్నగోపతి సిపిఐ సీనియర్ నాయకులు పాపగంటి గురవయ్య (67) అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జతేందర్‌రెడ్డి. రాష్ట్రసమితిసభ్యులు యర్రా బాబు మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి గురవయ్య అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు సిపిఐ లో కొనసాగుతున్నారని తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు రాజేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల, వైరా మండల కార్యదర్శులు గడల భాస్కర్‌రావు, యామాల గోపాల్‌రావు, సిపిఐ జిల్లా నాయకులు దొండపాటి రమేష్, బండారు పల్లి ముత్తయ్య, పాపగంటి సుదర్శన్, ఎద్దమునగాల ఉపసర్పంచ్ సుంకర రాధాకృష్ణ, అచ్చన శ్రీను, చిన్నమునగాల సర్పంచ్ ఊనాటి బాబు, సంసోను, యోబు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల కేంద్రమైన కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో పని చేస్తున్న వైద్యాధికారులు నెల్లూరి చందన, శిరీషలు పీజీలో సీటు రావడంతో ఉన్నత చదువుల కోసం ఇక్కడ నుండి వెళ్లిపోనున్నారు. వారికి మంగళవారం వైద్యశాల ఆవరణలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈకార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వసుంధరకు అత్యుత్తమ ప్రతిభ అవార్డు




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్య అధికారిని డాక్టర్ వసుంధర సేవలు ప్రశంసనీయమని ఆమె గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని క్షయ వ్యాధి నిర్మూలనలో ఆమె ఎంతో ఓర్పుతో వ్యాధి నిర్మూలనకు రోగులకు సూచనలు సలహాలు ఇస్తూ పూర్తిస్థాయిలో వ్యాధి నియంత్రణ అయ్యేవరకు ఔషధాలు వాడకంపై అవగాహన కల్పించడం ద్వారా క్షయ వ్యాధి రోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి సుబ్బారావు ఉప వైద్యాధికారి వేణుమాధవ్ డాక్టర్ వసుంధరకు ప్రతిష్టాత్మక ప్రతిభ అవార్డు సర్టిఫికెట్ అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ క్షయ వ్యాధి నిర్మూలనకు రోగులను ముందుగానే గుర్తించి వారికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడంలో సఫలీకృతం అయ్యారని వారన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలతో పాటు క్షయ వ్యాధి టీబీ నిర్మల కు తాను ఎంతో కృషి చేస్తుందని ఆమె వైద్య సేవలు పలువురికి సూక్తి దాయకమని తెలిపారు. డాక్టర్ వసుంధర లాంటి ప్రతిభవంతురాలికి సపోర్టుగా ఉంటూ ప్రజలకు సిబ్బంది వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన రోజున తాను చేస్తున్న వైద్య సేవలను గుర్తించి ఉత్తమ ప్రతిభ అవార్డు అందించినందుకు జిల్లా వైద్య అధికారులకు డాక్టర్ వసుంధర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మత్తుకు బానిస కావద్దు : ఎసిపి





**ప్రజాపక్షం/వైరా:** మత్తుకు బానిస కావద్దు భవిష్యత్తును ఆగం చేసుకోవద్దు, మాదకద్రవ్యాల నిర్మూలన ధ్యేయంగా ముందుకు సాగాలని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. మత్తు అనే మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలి అన్నారు. మంగళవారం వైరా మండలం సిరిపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన డ్రగ్స్ అవగాహన సదస్సు కార్యక్రమంలో వైరా ఏసిపి సారంగపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల నిర్మూలనకు నడు బిగించిందని అని ఆయన అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు పోవాలని అన్నారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనపై నడుం బిగించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే జీవితాన్ని ఆగం చేసుకోవద్దని ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయాలు చేస్తున్నట్లు సమాచరాం అందితే పోలీసులకు సమచారాం అందించాలని అన్నారు. కలిసికట్టుగా పోరాడి మత్తును పారద్రోలి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించే దాంట్లో భాగస్వాములు కావాలని అన్నారు. యువత మత్తుకు బానిసై ప్రాణాలను తీసుకుంటున్నారని, అదేవిధంగా మత్తు మాయలో పడి ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ప్రాణాలను సైతం కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్ సిబ్బంది అనిల్‌కుమార్, విజయ్, ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్, డిపార్ట్‌మెంట్ డిఆర్‌వోబి శ్రీను, వైరా ఎస్సై పుప్పాల రామారావు, వైరా ఎస్సై 2 పవన్‌కుమార్, సిరిపురం కార్యదర్శి శీలం నాగశేషిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి ఆలయాలు వేదికలు కావాలి



**- ఎస్‌కె సాబీర్ పాషా, మూడ్ గణేష్**

ప్రజాపక్షం/కొత్తగూడెం : నైతిక విలువల పెంపుకు, సామాజిక చైతన్యానికి ధార్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, అందుకు దేవాలయాలు వేదిక కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ ఉన్నారు. మంగళవారం సుజాతనగర్ మండలం సర్వారం గ్రామ పంచాయితీ ఒడ్డుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయ ధ్వజస్తంబం, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ..భక్తి భావం మనుష్యుల ఐక్యతను చాటుతుందని, ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఐక్యతను చాటేలా ఆధ్యాత్మిక చింతన పెరగాలని చెప్పారు. గ్రామాల్లో ఐక్యతను చాటేలా దేవాలయాల పునరుద్ధరణ జరగాలని, ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మధ్య క్రమశిక్షణను పెంచుతాయని తెలిపారు. దేవాలాయల నిర్మాణం కేవలం పూజలకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి వేదికలుగా నిలవాలని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి యుత వాతావరణం ఏర్పడుతుందని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్టు స్వామి, సర్పంచ్ భూక్యా సునీత, భూక్యా శ్రీనివాస్, రాంబాబు, హతీరామ్, ఎల్ వినాయక్, శోభన్, రమేష్, శ్రీను, జుంకీలాల్, కిషన్, అశోక్, సోజల్, శంకర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## 28న సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

**-29న కౌన్సిల్**

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 28న మధ్యాహ్నం 1గంటకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభం కానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా కౌన్సిల్ సమావేశం 29న ఉదయం 10 గంటలకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

## టిబి రహిత జిల్లాయే లక్ష్యం : కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : టిబి రహిత జిల్లాగా ఖమ్మంను తయారు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా స్థానిక బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 100 రోజుల వ్యవధిలో హైరిస్క్ ఉన్న 94 గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షల ద్వారా టిబి వ్యాధి నిర్ధారించి చికిత్సలు అందించాలన్నారు. ప్రస్తుతం జరిగే స్క్రీనింగ్ మరింత మెరుగ్గా జరగాలని వైద్య ఆరోగ్యశాఖతో పాటు మున్సిపాలిటీ, కార్పోరేషన్, పంచాయతీ పాలక వర్గాలు భాగస్వామ్యం కావాలన్నారు. పోలియో తరహాలో టిబి స్క్రీనింగ్ విస్తృతంగా జరగాలన్నారు. అనంతరం డ్రగ్స్ అసోసియేషన్ అందించిన న్యూట్రిషియన్ కిట్లను రోగులకు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వేణుమాధవ్, జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ సుబ్బారావు, వైద్యాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**



ప్రజాపక్షం/సత్తుపల్లి: బ్రిటీష్ సామ్రాజ్యా వాదానికి వ్యతిరేకంగా పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ఈ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహోన్నత యోధుడు సర్దార్ భగత్ సింగ్ అని, ఆయన చూపించిన మార్గంలో నడవడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని సిపిఐ భగత్ సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దండు ఆదినారాయణ మాట్లాడుతూ దేశం కోసం దేశ స్వతంత్రం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా ఉరితాళ్ళను ముద్దాడి ఈ దేశానికి స్వతంత్రాన్ని తెచ్చిన మహోన్నత యోధుడు, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించి పోరాడిన యోధుడు భగత్ సింగ్ అని కొనియాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక దేశంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతున్న మోదీ పరిపాలన వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు షేక్ రంజాన్ బి, సిపిఐ సీనియర్ నాయకులు కోలేటి వెంకటేశ్వర్లు, బండి రంగారెడ్డి, ఎస్.కె హమీద్, నాగళ్ళ నాగేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు శరత్ చంద్ర, ఎస్ కే పాషా, ఎస్.కె హకీమ్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, హనుమంతురావు ,ఉద్యోగ సంఘాల నాయకులు ఆదిల్ షరీఫ్, రమేష్, ఫుట్పాత్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు కేశవరావు, టౌన్ కమిటీ సభ్యులు శేఖర్ పాల్గొన్నారు.

## యశోద మలక్‌పేటలో అత్యాధునిక చికిత్స



ప్రజాపక్షం/ ఖమ్మం : యశోద ఆసుపత్రి మలక్ పేట బ్రాంచ్ ద్వారా అత్యాధునిక పద్ధతుల్లో మా తా శిశు వైద్య సేవలను అందిస్తున్నారు. సమయానుకూల నిర్ధారణ, అత్యాధునిక పద్ధతుల్లో శస్త్ర చికిత్స, నైపుణ్యంతో కూడిన వైద్య బృందం యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తుందన్నారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ గైనకాలజిస్టు డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ బైకోర్న్యుయేట్ యూటరస్, సార్ట్ సర్వీక్స్ డయాబెటిస్, థైరాయిడ్, గర్భధారణ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఖమ్మంకు చెందిన 30 ఏళ్ల మహిళ గర్భధారణలో పలు సమస్యలు ఎదుర్కొంటుండని గతంలో మూడు సార్లు గర్భస్రావానికి గురైందని ఆమె తెలిపారు. అత్యాధునిక పద్ధతుల్లో ఆమెకు చికిత్సను అందించడం జరిగిందని చికిత్స అనంతరం తల్లి, శిశువు ఇద్దరు ఆరోగ్యంతో ఉన్నారని శిశువు కూడా ఆరోగ్యంగా ఉండటం యశోద ఆసుపత్రి వైద్య బృందం సాధించిన ఘనతగా ఆమె తెలిపారు. అనేక క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ కేసును ఒక సవాల్‌గా తీసుకుని ల్యాప్రోస్కోపిక్ పద్ధతుల్లో చికిత్స చేయడంతో పాటు నిరంతర పర్యవేక్షణ వల్ల వైద్య రంగంలో ఒక గొప్ప విజయాన్ని సాధించడం జరిగిందన్నారు. యశోద మలక్‌పేట డాక్టర్ సత్యప్రియ సాహు మాట్లాడుతూ శిశువుకు శ్వాస సమస్యలు ఉండడంతో వెంటనే ఎన్‌ఐసియులో శిశువును ఉంచి ప్రత్యేక చికిత్స అందించడం జరిగింద న్నారు. ఈ మీడియా సమావేశంలో యశోద మలక్‌పేట డైరెక్టర్ పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



**వైరా ఏసిపి సారంగపాణి**

ప్రజాపక్షం/కొణిజర్ల : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో అమ్మపాలెం పంచాయతీపరిధిలోని విజయ ఇంజనీరింగ్‌కళాశాలలో మంగళవారం డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా సారంగపాణి మాట్లాడుతు విద్యార్థులకు మత్తు పదార్థాలకు అలవాటు పడితే తమ బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని అన్నారు. మత్తుపదార్థాలకు బానిస అయితే జీవితాలు చిత్తవుతాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. డ్రగ్స్ మత్తులో నేరాలకు పాల్పడతారని తర్వాత జీవితం చిన్నాభిన్నం అవుతుందని దానివలన మీ జీవితంతోపాటు మీకు జన్మనిచ్చినవారుకూడ సమాజంలో తలదించుకొని అవమానాల పాలవుతారని దీనిని దృష్టిలో పెట్టుకొని మంచి మార్గంలో పయనించి మీజీవితంతోపాటు మీతల్లితండ్రుల జీవితానికి కూడా మంచిపేరు తీసుకురావాలని పేర్కొన్నారు. మీరు మంచి మార్గంలో ఉంటె మీతల్లితండ్రులు చాలా గర్వపడతారని వారు చాలా సంతోషంగా ఉంటారని చెడుమార్గంలో ఉంటే వారు నిత్యం ఘోషపడుతు నిత్యం కుమిలిపోతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైరా సిఐ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఈగల్ టీమ్ రాజు, కొణిజర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ జి సూరజ్, తహశీల్దార్ అరుణ, ఎంపిడిఓ, ఏఓ బాలాజీ, ఐసిడిఎస్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ వి చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషాతరుణం, డీన్ డాక్టర్ డి శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్‌బాబా, వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహ స్వామి ఫోటో ఆవిష్కరణ



ప్రజాపక్షం/ చింతకాని : మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో గల పానకాల లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయం నందు లక్ష్మీ నర్సింహా స్వామి ఫోటోను ఆవిష్కరించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ సాయి గణేష్ నగర్ బోనకల్ రోడ్డు ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మీ నర్సింహా స్వామి ఫోటోను మంగళవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కడవెండి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాలతో పాటు పానకం వితరణ చేశారు. వాసవీ క్లబ్ ఆర్యవైశ్య సమాజ సభ్యులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడేవిధంగా పని చేస్తుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు, జిల్లా కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఆర్యవైశ్య మహాసభ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ తేలుకుంట్ల ధనుంజయ్‌రావు, చింతకాని ఆర్యవైశ్య మండల అధ్యక్షులు నాగుబండి వెంకటనారాయణ, కోదుమూరు భద్రయ్య, దోకుపర్తి నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి

**-భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి**
**-ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి**



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : భగత్ సింగ్ స్ఫూర్తితో యువత అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 95వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్ మాట్లాడుతూ దేశం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు అర్పించి యువతలో స్వాతంత్ర్య కాంక్షను భగత్‌సింగ్ రగిలించారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తమ పోరాటంతో గడగడలాడించిన వీరుడు భగత్‌సింగ్ అన్నారు. బిజెపి, ప్రధాని మోడీకి నిజమైన దేశభక్తి ఉంటే భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల స్ఫూర్తితో నేటి యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు, హైస్కూల్ ఇంచార్జి హెచ్‌ఎం రమణ, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గణేష్, రోహిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో గిరిజన భవన్‌ను వెంటనే పూర్తి చేయాలి

ప్రజాపక్షం/కారేపల్లి: వైరా నియోజకవర్గ కేంద్రంలో దాదాపు పది సంవత్సరాల క్రితం మంజూరైన గిరిజన భవన్ ఇప్పటికీ పూర్తి కాకపోవడం బాధాకరమని తెలంగాణ గిరిజన సంఘం కారేపల్లి మండల అధ్యక్షులు అజ్మీరా శోభన్ నాయక్, కార్యదర్శి బానోత్ బన్సీలాల్ నాయక్ తెలిపారు. గిరిజనుల సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడాల్సిన ఈ భవనం నిర్మాణం నిర్లక్ష్యంతో మధ్యలోనే నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతూ బుధవారం తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.